# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 179 | పేజీలు : 8 | వెల : రూ.2/- శనివారం 25 జూలై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# పిల్లలే భవిష్యత్ ఆస్తి

## రంపచోడవరంలో తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల భేటీలో సీఎం చంద్రబాబు

పిల్లలు పుడితే భారం కాకుండా చేశాం -ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు

విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది

**రంపచోడవరం, మన జనప్రగతి జూలై 24:** పిల్లలు ఆనందంగా చదువుకోవడానికి ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రంపచోడవరంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. విద్యా వ్యవస్థకు ఉపాధ్యాయులే వెన్నెముక అని అన్నారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులను ప్రయోజకులుగా చేయడం టీచర్ల బాధ్యతన్నారు. పిల్లలందరికీ పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. పీ4 కార్యక్రమంలో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి అని సీఎం తెలిపారు. పిల్లలు పుడితే భారం కాదని.. ఆదాయంగా మార్చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నామన్నారు. 67 లక్షల మంది పిల్లలకు రూ.10,120 కోట్లు జమ చేస్తున్నామని **2లో...**



# 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా..

పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం.. -పేపర్ లీకేజీ చట్టాన్ని కఠినతరం చేయనున్న కేంద్రం

దోషులకు 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా సవరణలు

నీట్-యూజీ వంటి పరీక్షల లీకేజీల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు



**న్యూఢిల్లీ, మన జనప్రగతి జూలై 24:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం-2024కు సవరణలు చేస్తూ, దోషులకు మరింత కఠిన శిక్షలు విధించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నూతన సవరణల ప్రకారం, ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడే వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం వ్యక్తిగత అక్రమాలకు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, **మిగతా 2లో...**

# గుంతకల్లు-బళ్లారి రైల్వే లైన్ విస్తరణ



గుంతకల్లు-బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్లు..

రూ.1264 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు కేంద్రం పచ్చజెండా

ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని మూడు జిల్లాలకు చేకూరనున్న లబ్ధి

భారీగా పెరగనున్న సరుకు రవాణా సామర్థ్యం, తగ్గనున్న రద్దీ

2028-29 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం

**న్యూఢిల్లీ, మన జనప్రగతి జూలై 24:** ఆంధ్రప్రదేశ్‌లోని కీలకమైన రైల్వే జంక్షన్ గుంతకల్లు మీదుగా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గుంతకల్లు-బళ్లారి సెక్షన్‌లో మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా **మిగతా 2లో...**

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం


నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ

నష్టపరిహారం, కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం

ప్రధాన్ రాజీనామాపై శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్రం

మంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామని విద్యార్థుల స్పష్టీకరణ

2లో.



# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు

పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ

క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, మన జనప్రగతి జూలై 24:** నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం **మిగతా 2లో...**



# ఎన్‌టీఏ ప్రక్షాళన..

## 47 మంది అధికారులపై వేటు

విశ్వసనీయతను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా 47 మంది అధికారుల తొలగింపు

పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానంలోనూ సంస్కరణలు

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు భారీ మార్పులకు సన్నాహాలు




2లో.

# పవన్ కోసం కలిసి పనిచేద్దాం

: నాదెండ్ల మనోహర్ పిలుపు!

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసైనికులకు నాదెండ్ల పిలుపు

గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టాలని హితవు

అన్ని పదవులు ఒకేసారి ఆశించవద్దన్న మనోహర్




2లో.

# కుంకీ ఏనుగులకు స్వాగతం

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో పంట పొలాలను నాశనం చేస్తున్న ఏనుగులు

పలమనేరు నుంచి పార్వతీపురం జిల్లాకు బయలుదేరిన రెండు కుంకీ ఏనుగులు

పూలమాలలు వేసి స్వాగతం పలికిన పవన్ కల్యాణ్

**విజయవాడ,మన జనప్రగతి జూలై 24:** విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తూ రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న అడవి ఏనుగుల గుంపును అదుపు చేసేందుకు అటవీశాఖ కుంకీ ఏనుగులను రంగంలోకి దించింది. పలమనేరు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు బయలుదేరిన 'జయంత్', 'అభిమన్యు' అనే రెండు కుంకీ ఏనుగులకు మంగళగిరిలోని **మిగతా 2లో...**



# నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రం అహర్నిశలు కృషి చేస్తోందన్న బండి సంజయ్

నీట్ ఘటనపై మోదీ తీవ్రంగా కలత చెందారని వ్యాఖ్య

ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పారన్న బండి సంజయ్

**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 24:** ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని **మిగతా 2లో...**



# కుంకీ ఏనుగులకు స్వాగతం

**మొదటి పేజీ తరువాయి**

తన క్యాంపు కార్యాలయం వద్ద ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్వాగతం పలికారు.కుంకీ ఏనుగులకు పూలమాలలు వేసి, స్వయంగా చెరుకు గెడలను ఆహారంగా తినిపించిన పవన్ కల్యాణ్... వాటికి వీడ్కోలు పలికారు. ఈ రెండు కుంకీ ఏనుగులను మొదట పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపునకు తరలించి, అక్కడి నుంచి అడవి ఏనుగులు తిరుగుతున్న ప్రాంతాలకు తీసుకెళ్లి వాటిని నియంత్రించేందుకు అటవీ అధికారులు పక్కా ప్రణాళిక రూపకల్పన చేశారు. జయంత్, అభిమన్యులకు గతంలో కూడా ఇలాంటి క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించిన అనుభవం ఉండటంతో అధికారులు మొదట వీటినే రంగంలోకి దించారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఒడిశా సరిహద్దుల నుంచి ఏనుగులు రాష్ట్రంలోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నందున, ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఒడిశా నుంచి కూడా మరికొన్ని కుంకీ ఏనుగులను రప్పించి ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆలోగా మన వద్ద ఉన్న కుంకీలతోనే జనవాసాల్లోకి వచ్చిన ఏనుగులను వీలైనంత త్వరగా తిరిగి అడవుల్లోకి మళ్లించేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# పవన్ కోసం కలసి పనిచేద్దాం

## : నాదెండ్ల మనోహర్ పిలుపు!




**విజయవాడ,మన జనప్రగతి జూలై 24:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. పార్టీలో అంతర్గత విబేధాలకు, గ్రూపు రాజకీయాలకు ఏమాత్రం తావులేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. "మనమంతా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వం కోసమే పనిచేస్తున్నాం.. వ్యక్తిగత వర్గాలు వద్దే వద్దు" అని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.గత కార్పొరేషన్ ఎన్నికల్లో అనేక ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ జనసేన ధైర్యంగా నిలబడిందని, విజయవాడలోని 39 డివిజన్లలో పోటీ చేసి సుమారు 50 వేల ఓట్లు సాధించడమే పార్టీకి ఉన్న క్షేత్రస్థాయి బలానికి నిదర్శనమని అన్నారు. ఆ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల శ్రమను పార్టీ ఎప్పటికీ మరువదని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవారు కేవలం సింబల్ పైనే ఆధారపడకుండా, వ్యక్తిగత విశ్వసనీయతను, ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని సూచించారు. కేవలం కార్లలో తిరుగుతూ పెద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టినంత మాత్రాన ఓట్లు రావని, సమస్యల పరిష్కారంలో భాగమైనప్పుడే ప్రజలు మద్దతు ఇస్తారని స్పష్టం చేశారు.ప్రస్తుతం జనసేన ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అన్ని పదవులను ఒకేసారి ఆశించడం సరికాదని, దశాబ్దాలుగా ఉన్న ఇతర కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ క్రమంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా జనసేన పార్టీపై, పవన్ కల్యాణ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను, దుష్ప్రచారాన్ని కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# ఎన్‌టీఏ ప్రక్షాళన.. 47 మంది అధికారులపై వేటు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 24:**

నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రక్షాళన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సంస్థ విశ్వసనీయతను పునరుద్ధరించే లక్ష్యంతో ఎన్‌టీఏలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 47 మంది అధికారులను విధుల నుంచి తొలగించింది.రాబోయే నెల రోజుల్లో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికానున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో భవిష్యత్తులో ఎలాంటి లీకేజీలకు, అవకతవకలకు తావులేకుండా అత్యంత పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొలగించిన 47 మంది అధికారులతో పాటు, మరికొందరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానాన్ని కూడా పూర్తిగా మార్చాలని, అంతర్గత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని భావిస్తోంది.ఈ ఏడాది జరిగిన నీట్-యూజీ పరీక్షలో పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు, పార్లమెంటులో విపక్షాల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. పరీక్షల నిర్వహణ వ్యవస్థను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఈ చర్యలు చేపడుతోంది.తాజా మార్పులు కేవలం స్వల్ప సర్దుబాట్లు కాదని, వ్యవస్థను సమూలంగా మార్చే 'ఫండమెంటల్ రీసెట్' అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నీట్, జేఈఈ మెయిన్, సీయూఈటీ వంటి 15 నుంచి 20 కీలక జాతీయ స్థాయి పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహిస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ప్రవేశ పరీక్షల పవిత్రతను కాపాడటమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం.

# నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

**మొదటి పేజీ తరువాయి**

కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు.

నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు.ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, భారత్‌లో అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్న పాకిస్థాన్‌కు చెందిన 480 సోషల్ మీడియా అకౌంట్లను తక్షణమే బ్లాక్ చేసిందని బండి సంజయ్ తెలిపారు.

# 10 ఏళ్ల జైలు, 10 కోట్ల జరిమానా..

**మొదటి పేజీ తరువాయి**

రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తున్నారు. వ్యవస్థీకృత నేరాలకు ఇప్పటికే కఠిన శిక్షలు ఉన్నప్పటికీ, తాజా సవరణలతో వాటిని మరింత పటిష్ఠం చేయనున్నారు.దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్-యూజీ 2026 పరీక్ష పత్రం లీక్ కావడంతో, ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించిన సంగతి విదితమే. ఈ పరిణామంతో పాటు పలు ఇతర పోటీ పరీక్షల్లోనూ అక్రమాలు చోటుచేసుకోవడంతో విద్యార్థి లోకం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

# జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**మొదటి పేజీ తరువాయి**

దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు పక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పిల్లలే భవిష్యత్ ఆస్తి






**మొదటి పేజీ తరువాయి**

చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనే 5 లక్షల మందికి రూ.664 కోట్లు జమ చేస్తున్నామన్నారు. గిరిజనులకు ఐఐటీలో ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఆగస్టు నుంచి సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించి జీవన ప్రమాణాలు పెంచుతామని వెల్లడించారు. పది లక్షల కోట్లు అప్పులు ఉన్నా.. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య పైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలిపారు. పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తులో పిల్లలే ఆస్తి. పిల్లలు పుడితే భారం కాదు.. ఆదాయంగా మార్చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గిరిజన ప్రాంతాల్లోనే 5లక్షల మందికి రూ.664 కోట్లు వారి ఖాతాల్లో వేశామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధిని నడిపిస్తున్నాం. పీ4 కార్యక్రమంతో పేదవారిని ఆదుకునేలా కృషి చేస్తున్నాం. అప్పులు కాదు.. ఆదాయాన్ని పెంచాలి. పిల్లలు సమాజానికి ఉపయోగపడాలి. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థకు వెన్నెముక ఉపాధ్యాయులు. సమాజంలో టీచర్లకు మంచి గుర్తింపు ఉంది. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పిల్లలు ఆనందంగా ఉంటే బాగా చదువుతారు. అందుకే వారికి పౌష్టికాహారం అందిస్తున్నాం. ఆగస్టు నుంచి సంజీవని ప్రాజెక్టు రాబోతోందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆ దిశగా ఇప్పటికే బలమైన అడుగులు వేస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం ఆర్థికసాయం మాత్రమే కాదని.. తల్లిని, గురువును గౌరవించడమే దీని అసలు లక్ష్యమని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 43 వేల పాఠశాలల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చర్చించేందుకు ఏర్పాటు చేసిన వేదిక ఈ మెగా పీటీఎం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తానని సీఎం చంద్రబాబుకు హామీ ఇచ్చానని.. అది తన ఒక్కడి వల్లే సాధ్యం కాదన్నారు. దీనికోసం తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అనుసంధానం కావాలని చెప్పారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 24:**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉద్ధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

"రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు.

ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు.

# హిమాచల్‌లో విషాదం..

## టాటా సుమోపై కొండచరియలు విరిగిపడి 13 మంది మృతి

**హిమాచల్‌ప్రదేశ్,మన జనప్రగతి జూలై 24:**

హిమాచల్ ప్రదేశ్‌లోని మారుమూల లాహౌల్-స్పితి జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఓ టాటా సుమో వాహనం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ వాహనం కుల్లు నుంచి పంగికి ప్రయాణిస్తోంది.ఉదయ్‌పూర్-కిల్లార్ రహదారిలోని కదు నల్లా సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. అంతకుముందు రోజు కొండచరియలు విరిగిపడటంతో అధికారులు ఈ మార్గాన్ని మూసివేశారు. దీంతో ప్రయాణికులతో ఉన్న ఆ వాహనం టిండి గ్రామంలో రాత్రంతా నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం అధికారులు మార్గాన్ని పునరుద్ధరించడంతో టాటా సుమో తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించింది. అయితే, ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే భారీ బండరాళ్లు వాహనంపై పడటంతో ఈ పెను ప్రమాదం సంభవించింది.సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, జిల్లా యంత్రాంగం మరియు విపత్తు ప్రతిస్పందన బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మృతుల వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



# గుంతకల్లు-బళ్లారి రైల్వే లైన్ విస్తరణ

**మొదటి పేజీ తరువాయి**

ఊపింది. ఈ విస్తరణ పనుల కోసం మొత్తం రూ.1,264 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కేంద్రం అధికారికంగా ప్రకటించింది.ఈ మల్టీట్రాక్ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని మూడు జిల్లాల గుండా వెళుతుంది. దీని ద్వారా భారతీయ రైల్వే నెట్‌వర్క్ సుమారు 46 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. 2028-29 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కొత్త లైన్ల నిర్మాణం వల్ల దాదాపు 99 గ్రామాలకు మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాంతాల్లోని సుమారు 7 లక్షల మంది ప్రజలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుంది. అంతేకాకుండా, బళ్లారి కోట, శ్రీ కుమార స్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలకు రైలు సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. గుంతకల్లు-బళ్లారి మార్గం ఇనుప ఖనిజం, డోలమైట్, సున్నపురాయి, ఉక్కు, బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు వంటి నిత్యావసర సరుకుల రవాణాకు అత్యంత కీలకమైనది. ఈ లైన్ల సామర్థ్యం పెంచడం ద్వారా ఏటా అదనంగా 16.22 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసేందుకు వీలవుతుందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఈ మార్గంలో రద్దీ తగ్గి, రైళ్ల రాకపోకలు వేగవంతం అవుతాయి. పర్యావరణ హితమైన రవాణా విధానంగా రైల్వే నెట్‌వర్క్ విస్తరణ దోహదపడుతుందని కేంద్రం పేర్కొంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశ చమురు దిగుమతులు ఏటా 1.32 కోట్ల లీటర్ల మేర తగ్గుతాయని, కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు 6.67 కోట్ల కిలోలు తగ్గుతాయని తెలిపింది. ఇది 0.27 కోట్ల చెట్లను నాటడంతో సమానమని వివరిం చింది. పీఎం-గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు, ప్రజలు, వస్తువులు, సేవల కదలికలకు అతుకులు లేని కనెక్టివిటీని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది.

మనజనప్రగతి

25- 07 - 2026

## రోగులకు ఏఐఎంఐఎం నాయకుల సేవలు

● ఏరియా ఆసుపత్రిలో పాలు,బ్రెడ్లు పంపిణీ





**ఆదోని మన జనప్రగతి జూలై 24:–**
ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు, వారి బంధువులకు ఏఐఎంఐఎం నాయకులు ప్రతి వారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం పట్టణ ఏఐఎంఐఎం అధ్యక్షుడు మహమ్మద్ జునైద్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులు, గర్భిణీలకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రతివారం ఇలాంటి సేవలు అందిస్తున్న ఏఐఎంఐఎం నాయకులను రోగులు, వారి బంధువులు, స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం నాయకులు సద్దాం హుస్సేన్, నాసిర్ హుస్సేన్, యూసుఫ్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో వైభవంగా జ్యేష్ఠాభిషేకం ప్రారంభం





**తిరుమల మన జనప్రగతి 2026 జూలై 24:**–తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఆషాఢ మాసంలో శ్రీ గోవిందరాజస్వామివారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి శతకలశ స్నపనం, మహాశాంతి హోమం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీటితో విశేష అభిషేకం చేసి, అనంతరం స్వామివారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనం ఇవ్వనున్నారు.

## బీహార్ చైన్ స్నాచర్లు అరెస్ట్... రూ.1.40 లక్షల నగదు స్వాధీనం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 24:**–కర్నూలు నగరంలో మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన కేసును నాలుగో పట్టణ పోలీసులు ఛేదించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారు బంగారు గొలుసు విక్రయించి పొందిన రూ.1.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు నాలుగో పట్టణ సీఐ విక్రమ్ సింగ్ శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గత నెల నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉల్చాల రోడ్డులో ఆదిత్యనగర్‌లో ఓ వివాహిత ఉదయం పాల ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు సమీపంలోని దుకాణానికి వెళ్లింది. అదే సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెల గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు పరిశీలించిన పోలీసులు బీహార్ రాష్ట్ర క్రైమ్ డిటెక్టివ్ బృందాలతో సమన్వయం చేసుకుని నిందితులను పాట్నాలోని బకార్గంజ్ ప్రాంతానికి చెందిన రవి కుమార్ కేశరి, దీప్ కుమార్ అలియాస్ అంకిత్ శర్మగా గుర్తించారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ పోసా శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ జీనస్, పీసీలు శ్రీనివాసులు, మురళీధర్‌లతో కూడిన ప్రత్యేక బృందం పాట్నాకు వెళ్లి ఇద్దరినీ అరెస్టు చేసింది. నిందితులు బంగారు గొలుసును విక్రయించి పొందిన రూ.1.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, అనంతరం వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విక్రమ్ సింగ్ తెలిపారు.

## తల్లికి వందనం పథకం అందించడం హర్షనీయం



**ఆదోని మన జనప్రగతి జూలై 24:**–పిల్లల చదువులకు భారం కాకుండా ప్రతి తల్లికి వారి చిన్నారి లకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు అందించడం హర్షినియమని టీడీపీ ఇంచార్జి శ్రీనివాస్ ఆచారి అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆదోని 19వ వార్డు మండిగిరి, దివాకర్ నగర్, ఆర్టీసీ కాలనీ లో తల్లికి వందనం పథకం కింద తల్లుల బ్యాంక్ ఖాతా లో డబ్బులు జమ కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కు, పవన్ కళ్యాణ్ కు, నారా లోకేష్ కు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డిష్ ఈరన్న, ధర్మారవి, జనసేన నాయకులు మంజు, రఘు, సునీల్ విరుపాక్షి , మరియు నరేంద్ర టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల అనుబంధమే విద్యార్థుల విజయానికి బలం

### విద్యార్థుల సమగ్ర వికాసానికి అందరూ కలిసి కృషి చేయాలి: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 24:** పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య దృఢమైన బంధం ఏర్పడితేనే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతిని సమర్థవంతంగా పర్యవేక్షించే అవకాశం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. పిల్లలు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో ఉపాధ్యాయులతో చర్చించి, వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. లీప్ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, సిలబస్, ప్రగతి నివేదికలు, పాఠశాల మౌలిక వసతుల వివరాలు తెలుసుకోవడంతో పాటు అభిప్రాయాలు, ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చని వివరించారు. ప్రతి తల్లిదండ్రి పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల నాణ్యమైన విద్య, మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ఆటిజం కేంద్రాలు, యువత ఉపాధి కోసం 'నైపుణ్యం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. 2024 వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద 100 పాఠశాలల్లో 235 అభివృద్ధి పనులకు రూ.34 కోట్లు వెచ్చిస్తున్నామని, మరో 1,400 పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గత మెగా డీఎస్సీ ద్వారా జిల్లాకు 2,000 మంది ఉపాధ్యాయులను కేటాయించగా, మిగిలిన ఖాళీలను కూడా రాబోయే మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయురాలు రోజా పాఠశాల పురోగతిని వివరించగా, డీఈఓ సుధాకర్ విద్య ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ప్రత్యేక మెనూ ప్రకారం భోజనం నిర్వహించి, తల్లిదండ్రులకు ఆటల పోటీలు, విద్యార్థులతో 'తల్లికి వందనం' కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు.

### ఆస్పరిలో హెలిప్యాడ్, సభా ప్రాంగణం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కర్నూలు ఎస్పీ



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 24:**–ఈ నెల 25వ తేదీన ఆస్పరి మండల కేంద్రంలో నిర్వహించనున్న "సంజీవని" కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రారంభించనున్న నేపథ్యంలో భద్రతా, ఇతర ఏర్పాట్లను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వాహనాల పార్కింగ్ ప్రాంతం, ప్రజల రాకపోకల మార్గాలు, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ పరిశీలనలో కర్నూలు ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణ మోహన్ , డీఎస్పీలు, సిఐ లు, సంబంధిత పోలీసు అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం


### మెగా పీటీఎం కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ సూచన



**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:–** స్థానిక ఉర్దూ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గురువులను గౌరవిస్తూ, తల్లిదండ్రుల మాట వినేలా మంచి విలువలతో ఎదగాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను సన్మార్గంలో నడిపిస్తూ, వారి చదువులపై నిరంతరం శ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం రెండో విడతలో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ లబ్ధి చేకూర్చేలా ఈ ఏడాది రూ.10,500 కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. అదేవిధంగా మహిళలు, విద్యార్థినుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు ప్రతి విద్యార్థికి యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు అందజేస్తూ, పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి మండల ఎంఈవో, ఉర్దూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, యాసీన్, మాబు షరీఫ్, స్కూల్ కమిటీ సభ్యుడు కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి


**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 24:–** ప్రొద్దుటూరు పట్టణంలోని ఎద్దుల వెంకటసుబ్బమ్మ పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా సమావేశమై విద్యార్థుల విద్యాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి పౌరులని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా రెండో ఏడాది కూడా అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేల చొప్పున జమ చేస్తూ, పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన విద్య, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, ఎంఈఓ సావిత్రమ్మ, ప్రధానోపాధ్యాయులు విజయ్ భాస్కర్, పాఠశాల తల్లిదండ్రుల సంఘం చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక



## ముళ్ల పొదలతో రహదారి మూసుకుపోయి ప్రజలకు ఇబ్బందులు



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 24:-**మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో వున్న బీసీ సంక్షేమ వసతి గృహం సమీపంలో రహదారి ఇరువైపులా ముళ్ల పొదలు విస్తరించి రహదారి కనిపించకుండా పోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ రాకపోకలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు సంభవించేలోపే ముళ్ల పొదలను తొలగించి రహదారిని వినియో గానికి అనువుగా మార్చాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఉప్పరపల్లి పంచాయతీ కార్యదర్శి సునీల్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం విధి నిర్వహణలో భాగంగా శ్రీకాళహస్తిలో శిక్షణలో ఉన్నట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో జేసీబీ యంత్రంతో రహదారి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను తొలగించి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు.


## సిద్ధరాంపురంలో డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 24:-**మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో "డెంగు రహిత సమాజం కోసం పరిసరాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం" అనే నినాదంతో డెంగ్యూ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ..డెంగ్యూ, మలేరియా,చికున్‌గున్యా, మెదడువాపు జ్వరాలు వంటి కీటక జనిత వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు దోమ పుట్టకూడదు.. దోమ కుట్టకూడదుఅనే నినాదంతో ప్రతి వారం ఒక రోజు డ్రై డే పాటించి,ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే దోమతెరలు వినియోగించడం,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పాత టెంకాయ చిప్పలు,పాడైన టైర్లు,వాటర్ బాటిళ్లు,డబ్బాలు వంటి నీరు నిలిచే వస్తువులను తొలగించడం లేదా నిర్మూలించడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని వివరించారు. ఎంఎల్‌హెచ్‌పి రాధమ్మ,ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ,ఆశా కార్యకర్త నాగవేణి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు సొంత నిధులతో పరిష్కారం

- మాజీ సర్పంచ్ వర్రా నారాయణరెడ్డి సేవలు
- పొంచి కట్టి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం
- శుక్రవారం ఉదయం ప్రారంభమైన శుభ్రత పనులు



**వేముల మన జనప్రగతి జూలై 24:** వేముల మండల పరిధిలోని కొండ్రెడ్డిపల్లి గ్రామంలో మసీదు సమీపంలో డ్రైనేజీ కాలువ పూడుకుపోయి పొంచి కట్టి దుర్వాసన వెదజల్లడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన మాజీ సర్పంచ్ వర్రా నారాయణరెడ్డి వెంటనే స్పందించి శుక్రవారం ఉదయం శుభ్రత పనులను చేపట్టారు.తన సొంత నిధులతో కార్మికులను ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.దీంతో మసీదు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన సమస్యకు ఉపశమనం లభించింది.గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని వర్రా నారాయణరెడ్డి తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తన వంతు సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నా నన్నారు.డ్రైనేజీ శుభ్రపరిచే పనులు పూర్తికావడంతో స్థానికులు మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.

## మతసామరస్యానికి ప్రతీక

- ఆంజనేయస్వామి ఆలయానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చిన రిటైర్డ్ టీచర్ ఇమామ్ సాహెబ్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 24:-** మతసామరస్యానికి, సోదరభావానికి అద్దంపట్టే అరుదైన ఘట్టం పులివెందులలో చోటుచేసుకుంది. పట్టణంలోని కొత్త ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి ఆగడూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు (రిటైర్డ్ టీచర్) ఇమామ్ సాహెబ్ రూ. 1,00,000 (ఒక లక్ష రూపాయలు) భారీ విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులకు విరాళం నగదును ఆయన స్వయంగా అందజేశారు. స్వామివారి పట్ల ఇమామ్ సాహెబ్‌కు ఉన్న భక్తిశ్రద్ధలను, సమాజం పట్ల ఆయన చూపిన ఉదారతను స్థానిక ప్రజలు మరియు ఆలయ నిర్వాహకులు విశేషంగా కొనియాడారు.సమాజంలో ఇటువంటి సత్కార్యాలు కులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఆలయ ప్రతినిధులు కొనియాడారు. విరాళం అందించిన ఇమామ్ సాహెబ్‌కు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆ శ్రీ ఆంజనేయస్వామివారి దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని,వారందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు ఆకాంక్షించారు.

## ఏవీఎస్ పాఠశాలలో మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశం

- విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన
- విద్యార్థులు,తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు



**ఒంటిమిట్ట మన జనప్రగతి జూలై 24:-**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశాల్లో భాగంగా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలోని ఏవీఎస్ ఎయిడెడ్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు అవ్వారు వెంకట వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యా పురోగతి, పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేసి, వారి అభ్యాస స్థాయి, హాజరు, ప్రతిభతో పాటు మెరుగుపరచాల్సిన అంశాలపై ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువల పెంపుతో పాటు పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్రపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి కూడా వివరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ప్రతి శుక్రవారం 'ఫ్రైడేడ్రై డే' పాటించాలి





**సిద్ధవటం మన జనప్రగతి జూలై 24:-**డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సిద్ధవటం మండల కేంద్రంలోని ఎగువపేట, రత్న సభాపతి నగర్ ప్రాంతాల్లో శుక్రవారం డెంగ్యూపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులను నివారించవచ్చన్నారు. జలుబు, దగ్గు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ జూలై 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ప్రతి శుక్రవారం 'ఫ్రైడేడ్రై డే' పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, నీటి పాత్రలను శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమల నుంచి రక్షణ కోసం పూర్తి వస్త్రాలు ధరించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి లక్ష్మీ నరసమ్మ, సూపర్‌వైజర్లు మౌలాలి, శారదాదేవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది లోకేశ్వరి, ఆదిలక్ష్మి, ఆశా వర్కర్లు పద్మజ, విజయభారతి, కళావతి, ఓబులమ్మ, 104 వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సమాజం తోడైతేనే ప్రగతి

- మెగా పీటీఎం-4.0లో విద్యార్థుల ప్రగతిపై సమీక్ష
- పాఠశాలకు ఉపాధ్యాయుల విరాళాలు



**కలికిరి మన జనప్రగతి జూలై 24:-**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ అన్నారు. కలికిరి ఇందిరమ్మ కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ (పీటీఎం-4.0) నిర్వహించారు.కార్యక్రమంలో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యాస ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. ఉపాధ్యాయుడు వి. గంగరాజు రూ. 5 వేల నగదు, ఎన్. మధుసూదన్ రెడ్డి రూ. 2 వేల నగదు విరాళంగా అందించగా, పి. ఖాదరవల్లి రూ. 1,000 విలువైన క్రీడా సామగ్రి, నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులను పాఠశాలకు అందించారు. వారి సేవాభావాన్ని ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ మాట్లాడుతూ, మెగా పీటీఎం ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా ప్రగతిని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతోందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛందంగా విరాళాలు అందించిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్య అతిథులుగా హాజరైన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, విశ్రాంత ఉపాధ్యాయులు రమేష్ బాబు, స్థానిక నాయకుడు అగస్తీశ్వర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మెగా పీటీఎం కార్యక్రమం విద్యా నాణ్యత పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ వహిస్తూ పాఠశాల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.అనంతరం ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యాస సామర్థ్యాలపై ప్రత్యేకంగా చర్చించి, మెరుగైన ఫలితాల సాధనకు అవసరమైన సూచనలు చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు షబానా, సుజాత, లక్ష్మీదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం... రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ





**దేవనకొండ మన జనప్రగతి జూలై 24:**దేవనకొండ మండలంలోని కప్పట్రాల్లా గ్రామ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లేడు బుడుకల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని అన్నారు."తల్లికి వందనం" వంటి పథకాల ద్వారా తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు.అనంతరం బొజ్జమ్మ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## విద్యార్థుల అభ్యున్నతే పీటీఎం లక్ష్యం

**- బాలిశెట్టి హరిప్రసాద్, కుప్పాల వెంకటసుబ్బయ్య**


**సిద్ధవటం మన జనప్రగతి జూలై 24:-**సిద్ధవటం 11వ బెటాలియన్ ఆవరణలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులుఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (పీటీఎం), 'తల్లికి వందనం' కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బాలిశెట్టి హరిప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, నడవడికను సమీక్షించడంలో పీటీఎం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కుప్పాల మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా రంగంలో సంస్కరణలు వేగంగా అమలవుతున్నాయని, విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని, ఆ నిధులను పిల్లల విద్యాభివృద్ధికే వినియోగించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏ. కృష్ణ, రాజంపేట అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ బండి హరి, ఎంపిడిఓ మెహతాబ్ యాస్మిన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పులివెందుల ప్రభుత్వ బాలికల కళాశాలలో ఘనంగా తల్లిదండ్రులు-అధ్యాపకుల ఆత్మీయ సమావేశం

**● జిల్లా స్థాయిలో ప్రథమ,తృతీయ ర్యాంకులు సాధించిన వై.ఎస్.వి.ఆర్.ఎమ్ కళాశాల**

**● తల్లిదండ్రులకు పాదాభివందనం చేసిన విద్యార్థినులు**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 24:**–స్థానిక శ్రీ వై.ఎస్.వి.ఆర్.ఎమ్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం తల్లిదండ్రులు మరియు అధ్యాపకుల ఆత్మీయ సమావేశం అత్యంత వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు.కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థినులు తల్లిదండ్రులకు స్వాగతం పలికారు.అనంతరం తల్లిదండ్రులను వారి పిల్లల తరగతి గదుల్లో కూర్చోబెట్టి,అధ్యాపకులు వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థినుల విద్యా ప్రగతిని వివరించడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు,పోటీ పరీక్షల మెటీరియల్స్ మరియు సబ్జెక్ట్ మెటీరియల్స్‌ను ప్రదర్శించి చూపించారు.సమావేశంలో భాగంగా తల్లిదండ్రుల కోసం పలు వినోదాత్మక పోటీలను నిర్వహించి,విజేతలకు బహుమతులు అందజేశారు.అనంతరం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూగత విద్యాసంవత్సరం ఫలితాలలో కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం,ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు తృతీయ స్థానం సాధించారని హర్షం వ్యక్తం చేశారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించారు.కళాశాలలో అందుబాటులో ఉన్న వసతులు,మౌలిక సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించారు.కార్యక్రమంలో భాగంలో విద్యార్థినులు తమ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి(పాదాభివందనం) ఆశీస్సులు తీసుకున్నారు.పెద్దలందరూ పిల్లలకు విలువైన సందేశాన్ని అందించారు.సమావేశం అనంతరం తల్లిదండ్రులు,విద్యార్థినులు,ఉపాధ్యాయులు అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనిత,నాగేంద్రమ్మ,సుధాకర్ రెడ్డి, రామసుబ్బయ్య,త్రివేణి, చంద్రమౌళి,విజయభారతి, రామచంద్రారెడ్డి,జయశ్రీ, సత్యవతి,సుమిత్ర, బాలదేవగిరి,రామయ్య, సునీత,రమాదేవి మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**● మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ● నల్లపురెడ్డిపల్లె జడీపీహెచ్స్ పాఠశాలలో వైభవంగా 'మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ 4.0 ● పాల్గొన్న పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి,మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి**






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 24:**–విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు సాగాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్,మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డిలతో కలసి బీటెక్ రవి పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఆయన,బోధనా విధానం మరియు పాఠశాలలో అందుతున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం తల్లిదండ్రులు,ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా చర్చించారు.విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైంది.ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా పీటీమ్ వంటి కార్యక్రమాలు పాఠశాలలు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలను మరింత పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని బీటెక్ రవి తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,పులివెందుల మండల టీడీపీ అధ్యక్షుడు మర్తల జగన్ మోహన్ రెడ్డి, పుష్పానాథ్ రెడ్డి,పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి,యర్రబల్లె సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి,యోగానంద రెడ్డి, జయారామి రెడ్డి,బాబు రెడ్డి, ప్రజాప్రతినిధులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కూలీ మృతి..వి.కొత్తపల్లిలో విషాదం


**● వ్యవసాయ తోటలో మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదం**

**● తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి రవిశేఖర్ మృతి**

**● భార్య సుహాసిని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**



**వేముల మన జనప్రగతి జూలై 24:**–వేముల మండల పరిధిలోని స్థానిక వి.కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది.విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.వి. కొత్తపల్లి గ్రామానికి చెందిన పుల్లాసి రవిశేఖర్ (35) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి రాజగోపాల్ రెడ్డి వ్యవసాయ తోటలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు.స్థానికుల వివరాల ప్రకారం..తోటలోని మోటార్ స్టార్టర్‌ను ఆన్ చేసేందుకు



వెళ్లిన రవిశేఖర్‌కు స్టార్టర్ సమీపంలో తెగిపడిన విద్యుత్ తీగలు కనిపించలేదు.దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.గమనించిన స్థానికులు వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే రవిశేఖర్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.విద్యుత్ ప్రమాదంపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయంలో డీఐజీ ఉదయ్ భాస్కర్ వార్షిక తనిఖీలు

**● పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ**





**సిద్ధవటం మన జనప్రగతి జూలై 24:**–వార్షిక తనిఖీల్లో భాగంగా కర్నూలు రేంజ్ డీఐజీ ఉదయ్ భాస్కర్ శుక్రవారం సిద్ధవటం మండలం భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ పటాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన దర్బార్ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పటాలయంలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని తనిఖీ చేసి, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఆనందరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు రాజశేఖర్, వెంకటప్ప, ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

**● నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేయాలని డిమాండ్**




**దేవనకొండ మన జనప్రగతి జూలై 24:**–నీట్ వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో పార్లమెంటు మార్చ్ నిర్వహించిన విద్యార్థులు, యువజనులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.శుక్రవారం దేవనకొండ మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించి, అనంతరం బస్టాండ్ కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శులు శ్రీనివాసులు, భాస్కర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు న్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మధు, నాయకులు రెహమాన్, విజయ్, మహేంద్ర, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు నరేంద్ర, సహాయ కార్యదర్శి రంగస్వామి, నాయకులు రాజు, శివ, రమేష్, ఏఐవైఎఫ్ నాయకుడు రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బొమ్మనహల్‌లో ఘనంగా తల్లిదండ్రుల మెగా పేరెంట్స్-డే (4.0)కార్యక్రమం



**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 24:**–మండల పరిధిలోని అన్ని గ్రామలలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠాశాలలో తల్లిదండ్రుల మెగా పేరెంట్స్–డే (4.0) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున,ఎంపీపీ ముల్లంగి నాగమణి,నారాయణస్వామి, మండల కన్వీనర్ మల్లన్న, మండల విద్యాశాఖ అధికారులు వీరన్న,మల్లికార్జున,మరియు అన్ని గ్రామాలలో ఉన్న ప్రజా ప్రతినిధులు,మరియు అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు, ఈ సమావేశం సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని మెగా పేరెంట్స్ డే (4.0) విశేష స్పందన తెలియజేశారు,పలు విద్యార్థుల విజయం సాధించిన తల్లిదండ్రుల సమావేశం ఈసారి 4.0 సంచికగా మరింత విజయవంతంగా కొనసాగిందన్నారు,ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కొత్తపల్లిమల్లికార్జున మాట్లాడుతూ..ప్రతి విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి, భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయికి ఎదిగే లక్ష్యంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు, అనుభవాధారిత అభ్యసనం, ప్రాజెక్ట్ ఆధారిత విద్య,టీం వర్క్, కమ్యూనికేషన్ వంటి జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా పాఠశాలలో ఆధునిక బోధన పద్ధతులు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు, ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు టెక్నాలజీ పరంగా ముందుకు సాగేందుకు ప్రత్యేక శిక్షణ పద్ధతులు,శాస్త్రీయ దృక్పథంతో కూడిన పాఠ్య ప్రణాళికను పాఠశాల అమలు చేస్తోందన్నారు,పిల్లల్లో ఆత్మవిశ్వాసం,సామాజిక బాధ్యత,పెద్దలపట్ల గౌరవం పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషిస్తోందని కొత్తపల్లి మల్లికార్జున తెలియజేశారు, అన్ని గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమాన కార్యకర్తలు యువ నాయకులు ప్రధాన ఉపాధ్యాయులు,మరియు ఉపాద్యాయులు,పిల్లల తల్లిదండ్రులు,పాల్గొన్నారు.

## డ్రైడేఫ్రైడే పాటించి సీజనల్ వ్యాధులను నివారించవచ్చు..



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 24:**–మండల పరిధిలో ఉద్దేహాల్ గ్రామంలోని లైబ్రరీ వీధిలో ప్రజలకు డెంగ్యూ,మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి మాట్లాడుతూ..ప్రతి వారం డ్రైడేఫ్రైడే పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు,నీరు నిల్వ ఉండే పాత్రలు,ట్యాంకులు కూలర్లు,టైర్లు వంటి ప్రదేశాలను శుభ్రం చేయడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు,పరిశుభ్రమైన పరిసరాలతో విషజ్వరాల వ్యాప్తిని నివారించవచ్చన్నారు.అలాగే దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని, వేపాకుల పొగ వేయడం ద్వారా కూడా దోమలను దూరంగా ఉంచవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశా కార్యకర్తలు ఈరమ్మ,లక్ష్మి,హరిత,లక్ష్మి,ప్రజలకు అవగాహన కల్పించారు.

## విద్యారంగానికి ఎన్.డి.ఏ కూటమి ప్రభుత్వం పెద్దపీట

**● మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0లో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి**




**కడప మన జనప్రగతి జూలై 24:**–కడప నగరంలోని జయనగర్ కాలనీ ఓల్డ్ చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 4.0" కార్యక్రమంలో టీడీపీ జోనల్ కో–ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు,చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా రెండో ఏడాది కూడా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సింహాద్రిపురం స్వర్ణ సచివాలయంలో ఓటర్ల జాబితా పరిశీలన



**సింహాద్రిపురం అర్బన్ మన జనప్రగతి జూలై 24:**– స్థానిక స్వర్ణ సచివాలయంలో బుధవారం ఓటర్ల వివరాల పరిశీలన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సచివాలయ బిఎల్ఓ రాంబాబుతో కలిసి నాయకులు ఓటర్ల నమోదు, జాబితాలో సవరణలు మరియు ఇతర ముఖ్యమైన వివరాలపై సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కుమ్మెత లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని బిఎల్ఓను కోరారు.కొత్త ఓటర్ల నమోదు మరియు మార్పులు–చేర్పుల ప్రక్రియ వేగవంతంగా జరగాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాలుపంచుకున్నారు.ఇందులో బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కే.లక్ష్మీనారాయణ రెడ్డి, టిడిపి నాయకులు జగదీష్, వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే విద్యాభివృద్ధి సాధ్యం

**- వేంపల్లి టిడిపి మండల కన్వీనర్ తెలంగాణ వలి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:**– కూటమి ప్రభుత్వం తోనే విద్యాభివృద్ధి సాధ్యమని వేంపల్లి టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణవలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ ఉర్దూ స్కూల్ బిడాలమెట్ట లో వేంపల్లి టిడిపి మండల కన్వీనర్ తెలంగాణవలి, స్కూల్ చైర్మన్ షేక్ కమాల్ బి వైస్ చైర్మన్ మహబూబ్ జాన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. పులివెందుల నియోజకవర్గం ఇన్చార్జి శ్రీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పిల్లలకు తల్లుల ఖాతాలో తల్లికి వందనం వేయడం జరిగిందన్నారు.ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి, వేయడం జరిగిందన్నారు.మధ్యాహ్న భోజనం కూడా పౌష్టికాహారం,గుడ్డు , కుర్మా , కలర్ రైస్ పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా పెట్టడం జరిగింది. కార్యక్రమంలో మండల బీసీ నాయకుడు దక్కా రమేష్, పక్కిరుపల్లి టీడీపీ ఇంచార్జ్ పటాన్ ఇస్మాల్ , ఫరీద్, మనీ తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి

25- 07 - 2026

# వి.కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**● ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత ● నిర్వహణ పనుల నేపథ్యంలో ప్రజలు, రైతులు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు విజ్ఞప్తి**



**వేముల మన జనప్రగతి జూలై 24:**-వేముల మండల పరిధిలోని స్థానిక వి.కొత్తపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం అనగా నేడు ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ...వి.కొత్తపల్లి,పుట్టకోణమ్మ ఫీడర్,దుగన్నగారిపల్లి, అమ్మాయిగారిపల్లి, రంగోరుపల్లి గ్రామాలతో పాటు సంబంధిత వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.నిర్వహణ పనులు సురక్షితంగా, వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రజలు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని,రైతులు వ్యవసాయ పనులను అందుకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని,ప్రజలు, రైతులు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

# సమస్యలు పరిష్కార మయ్యేంతవరకు పోరాటాలు తప్పవు

**● వేంపల్లెలో స్టాంపు రైటర్ల వినూత్న నిరసన**



**వేంపల్లె మన జన ప్రగతి జూలై 24:**-తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాడుతూనే ఉంటామని వేంపల్లి దస్తావేజు లేఖరుల సంఘ ప్రతినిధులు నేతి శంకర్,ఎ రెడ్డయ్య,కోడూరు మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. సమస్యల సాధన కోసం వీరు చేపట్టిన పెన్డౌన్స్ సమ్మె శుక్రవారం కి ఐదో రోజుకు చేరుకుంది. ఈ మేరకు సదరు రైటర్లంతా నల్ల దుస్తులు ధరించి స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో కూర్చుని స్టాంప్ రైటర్ల ఐక్యత వర్ధిల్లాలి.. జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ప్రైవేటీకరణ ఆపడంతో పాటు రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. స్టాంప్ రైటర్లకు లైసెన్సులను పునరుద్ధరించి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు పరచి స్టాంపు రైటర్ల వ్యవస్థను కొనసాగించాలన్నారు. అంతకు మునుపు వేంపల్లె జెడ్పీటీసి సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి స్టాంపు రైటర్ల దీక్షా శిబిరానికి వెళ్లి వారికి మద్దతుగా కూర్చుని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో స్టాంప్ రైటర్లు గౌతం కృష్ణ తేజ,శ్రీనివాసులు బ్రహ్మయ్య,మల్లె సురేష్,శశి,గంగా మోహన్,షాబుద్దీన్ నాగేంద్ర,ఆసం శివారెడ్డి,ఎడాల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల వికాసానికే పేరెంట్-టీచర్స్ మీటింగ్స్

**● పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట**

**● మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి**

**● బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్లో ఘనంగా మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 24:**- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి వెంకట్రామిరెడ్డి తెలిపారు.పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తూ మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్స్ నిర్వహించడం అభినందనీయమని, ఇందుకు ప్రత్యేక కృషి చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.శుక్రవారం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులుఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ ఆయనకు పూలబొకే అందజేసి ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్స్ పండగ వాతావరణంలో జరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు,విద్యా సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తోందని,ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రుల నాయకత్వంలో అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలువుతున్నాయని పేర్కొన్నారు.విద్య కేవలం మార్కులకే పరిమితం కాకూడదని,సంస్కారం, విలువలు ముఖ్యమని ఉద్ఘాటించారు.తల్లిదండ్రులు ఆడ,మగ తేడా లేకుండా పిల్లలిద్దరినీ సమానంగా చదివించాలని సూచించారు.మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చన్నారు.విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు,చదివిన పాఠశాలకు,పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వెంకట్రామిరెడ్డి ఆకాంక్షించారు.ఈ ఆత్మీయ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యార్థినులకు యూసీఐఎల్ చేయూత

**● 280 మంది బాలికలకు యోగా మ్యాట్ల పంపిణీ**

**● మెగా పేరెంట్స్ డేలో ఘనంగా కార్యక్రమం**

**● సీఎస్ఆర్ ద్వారా విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం**




**వేముల మన జనప్రగతి జూలై 24:**-విద్యార్థినుల ఆరోగ్యం,మానసిక వికాసానికి తోడ్పాటునందించే లక్ష్యంతో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) తుమ్మలపల్లె యూనిట్ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది.శుక్రవారం ఉదయం మండల పరిధిలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో నిర్వహించిన "మెగా పేరెంట్స్ డే" కార్యక్రమంలో భాగంగా 280 మంది విద్యార్థినులకు యోగా మ్యాట్లను పంపిణీ చేసింది.యూసీఐఎల్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్లు ప్రభాస్ రంజన్ (మెకానికల్),డా.విజయ్ కుమార్ (జియాలజీ), చీఫ్ సూపరింటెండెంట్ (ఫిజిక్స్),ల్యాండ్ అక్విజిషన్ అధికారి, సీఎస్ఆర్ అధికారి డాక్టర్ బి.నవీన్ కుమార్ రెడ్డి పాల్గొని విద్యార్థినులకు యోగా మ్యాట్లను అందజేశారు.ఈ సందర్భంగా యూసీఐఎల్ అధికారులు మాట్లాడుతూ...యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అపూర్వమైన వారసత్వమని పేర్కొన్నారు.విద్యార్థి దశలో యోగా సాధన చేయడం వల్ల శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ఎంతో అవసరమని సూచించారు.యోగా మ్యాట్లు సురక్షితంగా సాధన చేసేందుకు ఉపయోగపడతాయని, విద్యార్థినులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యూసీఐఎల్ సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా విద్య,ఆరోగ్యం,మౌలిక వసతులు,సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.పాఠశాల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,సిబ్బంది,విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు,యూసీఐఎల్ సీఎస్ఆర్ కోఆర్డినేటర్ బి.గంగిరెడ్డి పాల్గొన్నారు.విద్యార్థినుల అభివృద్ధికి యూసీఐఎల్ అందిస్తున్న సహకారానికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

**● ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 24:**-స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలుర కళాశాలలో శుక్రవారం 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మేడమ్ విద్యార్థులను,వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం,గత 10 నుండి 15 సంవత్సరాలుగా ఇదే కళాశాలలో సేవలు అందిస్తున్న పార్ట్-టైమ్ ఉపాధ్యాయులు ఉమాదేవి ని కలసి తమ సమస్యలను విన్నవించారు.ఇటీవల కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్-టైమ్ ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన మార్చిన (కన్వర్ట్ చేసిన) విధంగానే, తమను కూడా పార్ట్-టైమ్ నుండి కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా గురుకులాల్లో క్రమబద్ధీకరించాలని కోరారు.ఈ విషయాన్ని గౌరవ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి దృష్టికి,అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరగా ఉమాదేవి సానుకూలంగా స్పందించారు.మీ సమస్యను ఖచ్చితంగా పెద్దల దృష్టికి తీసుకెళ్లి,న్యాయం జరిగేలా శాయశక్తులా ప్రయత్నిస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు,పార్ట్-టైమ్ అధ్యాపకులు,విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చదువుల్లో రాణించి కళాశాలకు పేరు తీసుకురావాలి

**● ఉన్నత విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి**

**● ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి**




**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:**- ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు, కళాశాలకు, అధ్యాపకులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వేంపల్లె ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశం 4.0 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ ఉన్నత విద్య ద్వారా జీవితంలో మంచి స్థానం సంపాదించి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. అవసరమైన సౌకర్యాలను ఉచితంగా అందిస్తూ నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. అధ్యాపకుల బోధనలను శ్రద్ధగా వినడంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కష్టపడి చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి, ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మహబూబ్ షాదీ ఖానా మాజీ చైర్మన్ శక్షా బాషా, అధ్యాపకులు భాస్కర్ నాయక్, షరీఫ్, ఫైరోజ్ ఖాన్, ఫకృద్దీన్, బాషా, ఖలీలుల్లాహ్, షఫీఉల్లాహ్, ఇర్ఫాన్, సలీం, నూర్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజ్ నిరసనలో విద్యాసంస్థల బంద్



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 24:** నీట్ పేపర్ లీకేజ్ ఘటనతో పాటు ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్పీ, ఏపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో పారదర్శకతను కాపాడాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిరణ్, లోకేష్‌తో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నీట్ అంశంపై విద్యాసంస్థల బంద్ విజయవంతం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 24:**-నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రొద్దుటూరులో విజయవంతమైంది.పట్టణంలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విభాగం వద్ద అఖిల భారత విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని, ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్‌ను నిర్బంధించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. జగదీష్, సీపీఎం నాయకుడు సత్యం, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పీటర్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చార్లెస్, పిఎస్వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్ కత్తి, ఎన్ టి ఎస్ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎరుకల ప్రసాద్, ఎన్ డి ఎస్ ఎఫ్ నాయకుడు రమేష్, ఎన్ ఎస్ ఎస్ ఎఫ్ పట్టణ అధ్యక్షుడు అనిల్ అశోక్‌తో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.

# చట్నీలో బల్లి.. గణేష్ హోటల్ సీజ్..!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 24:**-కడప జిల్లా ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామేశ్వరం రోడ్డులో ఉన్న గణేష్ హోటల్‌లో శుక్రవారం ఆహార భద్రతపై తీవ్ర నిర్లక్ష్యం వెలుగుచూసింది. స్థానిక కోనేటి కాల్వ వీధికి చెందిన సోహెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా చట్నీలో బల్లి కనిపించినట్లు ఆరోపించారు.ఈ విషయాన్ని హోటల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా వారు నిర్లక్ష్యంగా స్పందించినట్లు బాధితుడు తెలిపాడు. బల్లి పడిన ఆహారం తినడంతో బాధితుడి భార్యకు వాంతులు కావడంతో వెంటనే ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అనంతరం బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రతినిధులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న సంస్థ సభ్యులు వన్‌టౌన్ సీఐ టి.వి. కొండారెడ్డిని కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.ఫిర్యాదుపై వెంటనే స్పందించిన వన్‌టౌన్ సీఐ టి.వి. కొండారెడ్డి ఆధ్వర్యంలో, కడప మరియు అన్నమయ్య జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారి ఎం. హరిత హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక విచారణ అనంతరం గణేష్ హోటల్‌ను సీజ్ చేసి, సంబంధిత నిబంధనల మేరకు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఘటనపై అధికారులు మరింత విచారణ చేపట్టారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

**• మెగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా**






**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 24:**-విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో మార్పులు తీసుకొస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా అన్నారు.రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన పురోగతిని సమీక్షించడం, పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడం,విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ సమావేశం ఉద్దేశమన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువు, హాజరు, క్రమశిక్షణపై శ్రద్ధ చూపాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక బోధనా విధానాలు అమలు చేస్తున్నామని, విద్యార్థుల చేరికలు పెరగడం ఇందుకు నిదర్శనమన్నారు.పేద విద్యార్థుల చదువుకు అండగా ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.15 వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షలకు పైగా విద్యార్థులకు ఈ పథకం ప్రయోజనం అందిందన్నారు.రాయచోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 360 మంది విద్యార్థుల్లో సుమారు 300 మందికి రూ.45 లక్షల మేర తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరిందని తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో చదివి జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు.మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో రాయచోటి నియోజకవర్గంలో విద్య, రహదారులు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా జరుగుతోందని ప్రశంసించారు. పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నలకదొడ్డి ఉన్నత పాఠశాలలో ఘనంగా మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశం

**• విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకం**

**• టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్**




**పత్తికొండ మన జనప్రగతి జూలై 24:**-రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశాల్లో భాగంగా పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్‌టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనకు ఘన స్వాగతం పలికింది.ఈ సందర్భంగా బత్తిన రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణ ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల చదువు, ప్రవర్తన, అభివృద్ధి గురించి తెలుసుకునేందుకు పేరెంట్స్‌టీచర్స్ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కౌలుట్లయ్య, విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పూలరంగడు, టీడీపీ నాయకులు రఘుశేఖర్, మల్లికార్జున, ఆంజనేయ, రామలింగప్ప, శీను, దశరథ్, ఎర్రిస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పంట రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలి

**- రాయచోటిలో రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 24:**-అన్నమయ్య జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం పక్కనగల అంబేద్కర్ విగ్రహం వద్ద రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, రైతుల సమస్యలపై ముఖాముఖి చర్చించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఎంతో వ్యయప్రయాసలతో సాగు చేసిన పంటలు చేతికిరాక తీవ్రనష్టాలు చవిచూశామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు 20 రోజులు గడిచినా జిల్లాలో సరైన వర్షాలు కురవకపోవడంతో సాగు పనులు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. వర్షాలు వస్తాయనే ఆశతో చెనిక్కాయ విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు, వరినారుకోసం వడ్లుకూడా కొనుగోలుచేసి ఉంచినప్పటికి వర్షాభావం కారణంగా నారుమడులు పోయలేక తీవ్రఆందోళనలో ఉన్నామని చెప్పారు.రైతుల సమస్యలు విన్న అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు దేశానికి అన్నంపెట్టే రైతులపట్ల మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.రైతుల ఆత్మహత్యలను అరికట్టాలంటే వెంటనే రైతులు తీసుకున్న రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని, బ్యాంకుల ద్వారా కొత్త రుణాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు పెట్టుబడి సాయంగా విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు తదితర వ్యవసాయ అవసరాలను 90 శాతం సబ్సిడీతో అందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం సలహాదారు రామాంజనేయులు, రైతులు రామచంద్రారెడ్డి, వెంకట మల్లప్ప నాయుడు, జయరాం నాయుడుజయరాం రెడ్డి మల్లేష్ నాయుడుగిరిపెద్దిరాయుడు రఘురామప్ప తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి రాజీనామా చేసేవరకు పోరాటం కొనసాగిస్తాం

**• విద్యార్థులపై విచక్షణ రహితంగా దాడి చేసింది ముమ్మాటికి ఆర్ఎస్ఎస్, బిజెపి గుండాలే**

**• సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:**-కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ వెల్లడించారు. శుక్రవారం విద్యార్థి సంఘాల పిలుపు మేరకు విద్యా సంస్థల బంద్ కు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మోడీ ప్రభుత్వం స్పందించక పోవడం అత్యంత దురదృష్టకర విషయమన్నారు. చర్చలకు ఆహ్వానించాల్సిన కేంద్ర ప్రభుత్వం, పోలీసులతో లాఠీ ఝుళిపించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటన్నారు. విద్యార్థులపై విచక్షణ రహితంగా కొట్టించడం ఏమిటని! అసలు లాఠీఛార్జీలు చేసింది పోలిసులేనా? అని ప్రశ్నించారు. విద్యార్థులపై దాడి చేసింది ముమ్మాటికి ఆర్ఎస్ఎస్, బిజెపి గుండాలేనని ధ్వజమెత్తారు. ప్రశ్నపత్రాల లీకేజీ అరికట్టడం చేతకాని ప్రధాని మోడీ, భావిభారత విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నట్లు మండిపడ్డారు. విద్యను హక్కుగా కాకుండా కార్పొరేట్ వ్యాపారంగా మార్చిన విధానాల వల్లే నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, కుంభకోణాలకు మూల కారణమన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీ లకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఢిల్లీ పోలిసుల దుశ్చరక్యకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రాంతీయ కార్యదర్శి రాములు, ఏఐటియూసి కార్యదర్శి బ్రహ్మం, చాంద్ బాషా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**• ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**

**• కోసిగి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వైభవంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్**








**కర్నూలు/పులివెందుల మన జనప్రగతి జులై 24:**కర్నూలు జిల్లా,మంత్రాలయం నియోజకవర్గం,కోసిగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం) ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి తో కలిసి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి,సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పిల్లల సమగ్ర అభివృద్ధికి,పాఠశాలల్లో మెరుగైన వాతావరణాన్ని కల్పించడానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అకుంఠిత దీక్షతో పనిచేస్తోందని తెలిపారు.ఇది ప్రజల ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం విద్యార్థుల యోగక్షేమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ,వారు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.పాఠశాలలో మౌలిక వసతుల కల్పన,విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలపై ఈ సమావేశంలో ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్డిఓ,మండల విద్యాధికారులు కోసిగి మండల కన్వీనర్ సురేష్ నాయుడు పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యాస పురోగతిని తల్లిదండ్రులు పర్యవేక్షించాలి

**- మెగా పీటీఎం 4.0లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 24:**-పెద్దమండ్యం మండలం కలిచెర్ల జిల్లా పరిషత్ తెలుగు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్‌టీచర్స్ మీట్ (పీటీఎం) 4.0 కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల అభ్యాస పురోగతిని తల్లిదండ్రులు నిరంతరం పరిశీలించాలని సూచించారు.హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల ప్రాముఖ్యతను వివరించిన కలెక్టర్, వాటి ద్వారా విద్యార్థుల ప్రతిభ, అభివృద్ధిని అంచనా వేయవచ్చన్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి తల్లిదండ్రుల నుంచి సూచనలు స్వీకరించారు. అనంతరం పాఠశాలలో ముగ్గుల పోటీలు, సంగీత కుర్చీ, తాడు లాగుడు వంటి వినోద కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేంపల్లెలో వర్షాల కోసం అంకురార్పణ పూజలు



**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:**-వర్షాలు బాగా పడి ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ వేంపల్లి లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అష్టోత్తర శత కలశాభిషేక అంకురార్పణ పూజలు ప్రారంభించారు. వృషభాచలేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పివి రమణ, ఈవో సుభాష్ నేతృత్వంలో అర్చకులు హరిప్రవీణ్ తిరుమల వేణు ఆధ్వర్యంలో ఈ పూజలను ప్రారంభించారు. రెండు రోజులపాటు హోమాలు కలశ పూజలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గండి దేవస్థాన చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



## పచ్చని చెట్లు పర్యావరణానికి మెట్లు

**• యుటిఎఫ్ పులివెందుల ప్రాంతీయ కన్వీనర్ కాయపాటి రామాంజనేయుల**

**సింహాద్రిపురం మన జనప్రగతి జూలై 24:**-మెగా పేరెంట్ టీచర్స్ డే పురస్కరించుకొని సింహాద్రిపురం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని యుటిఎఫ్ పులివెందుల ప్రాంతీయ కన్వీనర్ కాయపాటి రామాంజనేయులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పచ్చని మొక్కలు ప్రగతికి రథచక్రాలని,వాతావరణ సమతుల్యతను కాపాడి,స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించి మానవ మనుగడకు మూల స్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేసి వారితోనే పాఠశాల యందు మొక్కలు నాటించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు మొక్కలను దత్తత ఇచ్చి, సంరక్షణ బాధ్యతలను చూసుకునే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు.మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా తీసుకున్నప్పుడే వర్షాభావ పరిస్థితులను, ఎల్ నినో లాంటి విపత్కర పరిస్థితులను అధిగమించ వచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్ వైపుగా ఆంధ్రప్రదేశ్ ను నడపడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ,ఎస్ఎంసి చైర్మన్ శేఖర్,వైస్ చైర్మన్ భవాని,పాఠశాల పిడి సివి రమణ రెడ్డి ఇతర బోధన బోధనేతర సిబ్బంది,గ్రామ పెద్దలు,విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వేంపల్లెలో యధావిధిగా రిజిస్ట్రేషన్లు

**- వేంపల్లి సబ్ రిజిస్టర్ కే.శ్యామలాదేవి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:**-వేంపల్లి ప్రాంతంలో స్టాంప్ రైటర్లు పెన్డౌన్ సమ్మె చేస్తున్నప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తామే భూ యజమానులకు రిజిస్ట్రేషన్లు చేయిస్తామని వేంపల్లి సబ్ రిజిస్టర్ కే.శ్యామలాదేవి తెలిపారు.తమ డిమాండ్ల సాధన కోసం స్టాంప్ రైటర్లు ఈనెల 20వ తేదీ నుంచి పెన్డౌన్స్ సమ్మెలో ఉన్నారన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తామే ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్లు చేయిస్తామన్నారు.ఈ మేరకు రిజిస్ట్రేషన్లు చేయించుకో దలచిన వారు తమ కార్యానికి రావాలని ఆమె కోరారు.ఇదిలా ఉండగా తమ డిమాండ్ల ను పరిష్కరించాలని కోరుతూ వేంపల్లిలో పెన్డౌన్ సమ్మె లో ఉన్న స్టాంపు రైటర్లు నేతి శంకర్ నేతృత్వంలో సబ్ రిజిస్టర్ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## పులివెందులలో హార్టి మిల్లెట్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 24:**హార్టి మిల్లెట్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జూలై 24, 2026న పులివెందుల మండలం,ఎద్దుల ఏని గ్రామంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రైతులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.ఆర్. నాగరాజు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, కళాశాల అధ్యాపక బృందం పాల్గొంది.ఈ సందర్భంగా డా.ఆర్.నాగరాజు రైతులకు నేల పరీక్ష కిట్లు మరియు పాల్గొన్న ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనం వేయడానికి లేదా మొక్కలు నాటడానికి ముందే నేల నాణ్యత పరీక్షలు చేయించుకోవడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. నేల పరీక్ష నివేదికల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను, ఎరువుల మోతాదును శాస్త్రీయంగా వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని,అలాగే సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించవచ్చని రైతులకు దిశానిర్దేశం చేశారు.డా.నాగలక్ష్మి (అసిస్టెంట్ ప్రొఫెసర్) సమన్వయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డా.సయ్యద్ సదరున్నీసా,అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.శరత్ కుమార్ రెడ్డి,డా.చిరంజీవి,డా.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న రైతులు హార్టి మిల్లెట్ ఆధారిత విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, పుట్టగొడుగుల (మష్రూమ్) సాగు మరియు ఇతర ఆదాయాభివృద్ధి ఉద్యాన సాంకేతికతలపై విశేష ఆసక్తి కనబరిచి,సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

మనజనప్రగతి

25- 07 - 2026

# తల్లికి వందనం..విద్యార్థి కుటుంబాలకు వరం

**● ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి లబ్ధి అభినందనీయం ● జనసేన నేత గోసల ఆంజనేయులు**



**వేంపల్లి మన జనప్రగతి జూలై 24:–**తల్లికి వందనం పథకం విద్యార్థుల కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని జనసేన నేత గోసల ఆంజనేయులు అన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం సంతోషకరమన్నారు. గతంలో అమ్మఒడి పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కరికే లబ్ధి చేకూరేదని, ప్రస్తుతం కుటుంబంలోని ప్రతి విద్యార్థికి ప్రయోజనం అందుతోందని తెలిపారు.కర్నూలు జిల్లా మాధవరానికి చెందిన ఏలియా, సంగీత దంపతులకు ఆరుగురు పిల్లలు ఉండగా వారందరికీ కలిపి రూ.78 వేలు లబ్ధి అందిందన్నారు. అలాగే నెల్లూరు, పల్నాడు, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఐదుగురు పిల్లలు ఉన్న కుటుంబాలకు రూ.65 వేల వరకు ఆర్థిక సహాయం అందిందని తెలిపారు.రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి తల్లికి వందనం పథకం అందడం గర్వించదగ్గ విషయమని గోసల ఆంజనేయులు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం అభినందనీయమన్నారు.విద్యారంగ అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు జనసేన నేత గోసల ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

# పులివెందులలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**● కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**

**● సిపిఐ,ఎఐఎస్ఎఫ్,ఎఐఎస్పి డిమాండ్**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 24:–** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,ఢిల్లీ పోలీసుల ప్రవర్తనకు బాధ్యత వహిస్తూ హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.విద్యార్థి,యువజన సంఘాలు (ఎఐఎస్ఎఫ్,ఎఐఎస్పి) తలపెట్టిన విద్యాసంస్థల బంద్ పులివెందులలో విజయవంతమైంది.అవినీతికి నిలయంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ )ని రద్దు చేసి,పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరపాలని ఢిల్లీలో శాంతియుతంగా చలో పార్లమెంట్ చేపట్టిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం,విద్యార్థినుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండించారు.విద్యను వ్యాపారంగా మార్చి,కోచింగ్ మాఫియాను ప్రోత్సహిస్తూ పేద,మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం అంధకారంలోకి నెడుతోందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరాములు,ఎఐఎస్పి జిల్లా అధ్యక్షుడు జె.దినేష్ కుమార్,విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ విద్యార్థుల్లో ప్రాథమిక ఉద్యోగ నైపుణ్యాల పెంపే లక్ష్యం

**● ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ విజయ ప్రకాష్**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 24:–**ట్రిపుల్ ఐటీ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయ ప్రకాష్ పేర్కొన్నారు.ట్రిబుల్ ఐటీలో శుక్రవారం విద్యార్థులకు స్కిల్– సెన్సస్2026 ( ఫేస్– 1 ఫౌండేషనల్ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అసెస్మెంట్) పరీక్షను ఆన్లైన్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు నిర్వహించారు. ఆర్‌జీయూకేటీఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో మధ్యాహ్నం 2.00 గంటల నుండి 5.00 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ పరీక్షను డైరెక్టర్ పర్యవేక్షించారు. పరిశ్రమలకు అవసరమైన ప్రాథమిక ఉద్యోగ నైపుణ్యాలను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లోని అన్ని శాఖలకు చెందిన 691 మంది బీ.టెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. 23 తరగతి గదుల్లో జనరల్ ఆప్టిట్యూడ్, వర్బల్ & నాన్–వర్బల్ రీజనింగ్, ఇంగ్లీష్ కంప్రహెన్షన్, పైథాన్ ప్రోగ్రామింగ్ అంశాలపై పరీక్షలు నిర్వహించారు.పరీక్ష నిర్వహణను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. రవి కుమార్, డీన్ (అకాడమిక్స్) డా.రమేష్ డౌండ్కర్, ఆర్‌జీయూకేటీ ఒంగోలు క్యాంపస్ డీన్ డా. రూపస్ కుమార్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఇన్‌చార్జ్ సత్యానందరామ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి. సుందర్ పర్యవేక్షించగా, అధ్యాపకులు, ఐటీ బృందం సమన్వయంతో పరీక్ష ఎటువంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించారు.అధికారులు మాట్లాడుతూ స్కిల్ సెన్సస్2026 ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను అంచనా వేసి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థికి డిజిటల్ స్కిల్ కార్డు అందజేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలోకెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# పులివెందులలో 87.5 శాతం ఎస్ఐఆర్ పూర్తి

**పులివెందుల నియోజకవర్గంలో 29,834 మంది ఓటర్లకు నోటీసులు**

**అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా విడుదల: ఆర్డీఓ చిన్నయ్య**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 24:–** పులివెందుల నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 87.5 శాతం పూర్తి అయ్యిందని రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ చిన్నయ్య తెలిపారు.శుక్రవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో చిన్నయ్య తహసిల్దార్,నజీర్ అహ్మద్ మున్సిపల్ కమిషనర్ తనూజ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లు ప్రజా ప్రతినిధులతో ఓటర్ జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం వేగంగా పూర్తి అయిందని,నియోజకవర్గంలో మొత్తం 2,30,276 మంది ఓటర్లు ఉండగా,వీరిలో ఇప్పటికే 2,00,442 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని అధికారులు తెలిపారు.మిగిలిన పరిశీలనలో భాగంగా చనిపోయిన వారు,శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు,ఇప్పటికే మరోచోట నమోదైన వారు,చిరునామాలో లేని వారు వంటి వివిధ కోవలకు చెందిన మొత్తం 29,834 మంది ఓటర్లకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశామని తెలిపారు . నోటీసులు అందుకున్న వారు తమ వివరాలను పరిశీలించి, అవసరమైన ఆధారాలతో నిర్ణీత గడువులోగా స్పందించాలని అధికారులు సూచించారు.ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాను 2026 జూలై 31న ప్రచురించనుండగా, అభ్యంతరాలు,క్లెయిమ్‌ల పరిశీలన అనంతరం తుది ఓటరు జాబితాను 2026 అక్టోబర్ 3న విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.నోటీసులు ఇచ్చిన తేదీ నుండి 15 రోజులు గడువు ఉంటుందని తెలిపారు.ఈలోగా సంబంధిత ఓటర్లు తమ పత్రాలను సమర్పించినట్లయితే వారి ఓటును తిరిగి నమోదు చేస్తామని,లేనిపక్షంలో ఆ ఓట్లను తొలగిస్తామని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియలో ప్రజా ప్రతినిధులు,రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అధికారులు కోరారు.ఓటర్లు ఎవరైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బిఎల్ఓ లు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో అన్ని పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పులివెందుల హార్టికల్చర్ కళాశాలలో అట్టహాసంగా ద్వితీయ వార్షికోత్సవం

**ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త దిశగా అడుగులు వేయాలి: డీన్ డా.బి.ప్రసన్న కుమార్**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 24:–** డా. వై.ఎస్.ఆర్.హార్టికల్చరల్ విశ్వవిద్యాలయం పరిధిలోని పులివెందుల కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్‌లో ద్వితీయ కళాశాల దినోత్సవ వేడుకలు జూలై 23న అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ హార్టికల్చర్ డీన్ డా.బి.ప్రసన్న కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.యుసిఐఎల్ ఏజీఎం ప్రభాస్ రంజన్,ఏపీసీఏఆర్ఎల్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ & అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.శివ ప్రసాద్,కళాశాల అసోసియేట్ డీన్ డా.ఆర్. నాగరాజు మరియు విద్యార్థి వ్యవహారాల విభాగాధిపతి డా.సయ్యద్ సదారున్నిసా సమక్షంలో దీపప్రజ్వలన గావించారు.కళాశాల అసోసియేట్ డీన్ డా.ఆర్.నాగరాజు సభకు స్వాగతం పలుకుతూ వార్షిక నివేదికను సమర్పించారు. విద్యాబోధన,మౌలిక వసతుల కల్పన,విద్యార్థులు మరియు అధ్యాపకులు సాధించిన ప్రతిభాగోసాలు,విజయాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు.ముఖ్య అతిథి డా.బి.ప్రసన్న కుమార్ ప్రసంగిస్తూ ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త (వన్ ఫ్యామిలీ వన్ ఇంట్రెప్రెనేర్ ) అనే లక్ష్యంతో విద్యార్థులు కేవలం ఉద్యోగ అన్వేషణకే పరిమితం కాకుండా, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.రైతులకు పంట అనంతర సాంకేతికతలు (పోస్ట్–హార్వెస్ట్ టెక్నాలజీస్ ),విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో మార్గదర్శకంగా నిలవాలన్నారు.మరో అతిథి శ్రీ ప్రభాస్ రంజన్ మాట్లాడుతూ,ఉద్యాన రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.అకడమిక్స్,క్రీడలు,సాంస్కృతిక పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు,పతకాలు మరియు ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ,జానపద నృత్యాలు, సంగీత విభాగాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.విద్యార్థుల క్రమశిక్షణ,నైపుణ్యాలు మరియు ఉత్సాహం ఈ ద్వితీయ కళాశాల దినోత్సవాన్ని చిరస్మరణీయంగా మార్చాయి.

# చిట్వేలిలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం -4.0

**చిట్వేలి మన జనప్రగతి జూలై 24:–**ప్రభుత్వ ఆదేశాలతో చిట్వేలి మండలంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నందు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో తరగతి వారీగా ముఖాముఖి చర్చ నిర్వహించారు.తమ పిల్లల గురించి తల్లిదండ్రులు తెలియజేసిన సమాచారాన్ని, వారిచ్చిన సలహాలను నమోదు చేశారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు శివ నారాయణ గౌడ్ లీప్ యాప్, దీక్షా యాప్ గురించి తల్లిదండ్రులకు వివరించారు. బాలికల విద్య అవశ్యకత గురించి పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సోఫియా తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ముఖాముఖి చర్చ అనంతరం సమావేశానికి వచ్చిన తండ్రులకు టగ ఆఫ్ వార్, తల్లులకు కుర్చీలాట క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ



సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లలు ఎలా చదువుతున్నారు అనే విషయాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని కోరారు. పాఠశాల కమిటీ చైర్మన్ శివ శంకర్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ బడుల పట్ల, విద్య పట్ల ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ విద్యారంగాన్ని దేశంలోనే అగ్రశ్రేణిలో నిలపాలని మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల కోసం కల్పించే సౌకర్యాలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులు పాఠశాల వచ్చి తమ పిల్లల యొక్క విద్యా ప్రగతి, ప్రవర్తన వంటి విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు తల్లికి వందనం గురించి, ప్రభుత్వం తమకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. తల్లిదండ్రులకు నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బాలురు, బాలికల వసతి గృహాల వార్డెన్లు హరిప్రసాద్, సుబ్బరాజు, ప్రభావతి పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో ఘనంగా మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ 4.0

**విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం అవసరం**




**రామాపురం మన జనప్రగతి జూలై 24:–** రామాపురం మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలా దేవి, ఎస్ఎంసీ చైర్మన్ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరయ్యారు.మండల విద్యాశాఖాధికారి జయచంద్రుడు, ఎంపీడీవో జాషువా, ఎస్ఐ శివకుమార్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, పరీక్షల ఫలితాలు, హాజరు శాతం, ప్రవర్తనపై తల్లిదండ్రులకు వివరించారు. తల్లికి వందనం పథకం, విద్యార్థులకు అందించిన విద్యా కిట్ల వినియోగంపై అవగాహన కల్పించారు.పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా అందిస్తున్న డిజిటల్ బోధనా విధానాన్ని అధికారులు, తల్లిదండ్రులు పరిశీలించారు. విజయవంతం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ శ్యామలా దేవి, ఎస్ఎంసీ చైర్మన్ భాస్కర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174